కలకాని కథ

నందం రామారావు

బావ వెళ్ళిపోయాడు!

ఆ రోజల్లా అనుకుంటూనే వుంది రాధ.

బావ వున్న పదిరోజుల్లోనూ ఆనెన్నో సంగతులు చెప్పాలనుకుంది. నవ్వించి, లాలించి, ఏడిపించాలని చాలా చాలా కలలుగంది.

బావ వొస్తాడన్న రోజున తనెంత సంబరపడిందని?

మనసులో వున్న మాటను బయటకు రానీకుండా ఆనందంగా బావ కోసం ఎదురు చూసింది. బావతో మాట్లాడే తీరును తలచుకుని ముచ్చట పడిపోయింది.

బావ వొచ్చాడు. వెళ్ళిపోయాడు!

ఈ రెండు వాక్యాలే మిగిలిపోయాయి.

ఈ రెండు వాక్యాల మధ్య వున్న దూరాన్ని మధురంగా గడపాలని ఆశించింది.

బావ వెళ్లిపోయాడు!

రాధ నిట్టూర్చి దొడ్లో వున్న పందిరి గుంజకు ఆనుకుంది.

నిద్ర రావడంలేదు. అవును నిద్దరాదు. బావ జ్ఞాపకాలతో నిద్దరాదు.

చల్లని గాలి వీస్తోంది కొబ్బరి చెట్ల మధ్యలోంచి వెన్నెల కురుస్తోంది. మల్లెపూల వాసన మత్తెక్కిస్తోంది.

రాధ బరువుగా కళ్ళు మూసుకుంది.

బావ కనుపిస్తున్నాడు.

* * *

బావ వొచ్చిన రెండో రోజున వెళ్ళింది. హాల్లో మామయ్య పేపరు చదువుకుంటున్నాడు. రాధ కేసి గంభీరంగా చూశాడు. మామయ్య కంటే ఆయన పిసినారితనమే భయం!

ఆయన కెప్పుడూ శంకరం శ్రద్ధగా చదవడం, పైకి రావడం కావాలే గానీ, 'పోనీలే రాధ వాడికి కాబోయే పెళ్ళాం కాసేపు హాయిగా మాట్లాడుకోనియ్' అని అనుకోడు.

శంకరం చదువు, అతను డాక్టరు కావడం— మామయ్య మనసిది!

వయసులో మామయ్య కూడా ఇలాగే వున్నాడేమో?

మామయ్య పేపరు చదువుతూ తీవిగా కూర్చున్నాడు. ఎక్కడో ఏదో దేశంలో శాంతి సంప్రదింపులు జరిగి వుంటాయి. లేదా, రైలు ప్రమాదాలు ఎక్కడా జరక్కుండా వుండి వుంటాయి.

హఠాత్తుగా తలెత్తి—

"రాధమ్మా" అని పిలవడు గదా!

రాధ బిక్కుబిక్కుమంటూ శంకరం గదిలో కెళ్ళింది.

శంకరం పడక్కుర్చీలో పడుకుని పుస్తకం చదువుకుంటున్నాడు. రాధ గుమ్మంలో అడుగు పెట్టి నుంచుంది. ఎదురుగా అందమైన యువతి, అందునా కాబోయే భార్య నుంచునుంటే బావ చూడడేం ఖర్మ! గాజులు శబ్దం చేస్తూ చేతులు వూపింది.

ఓహో. ఇటు చూస్తేనా?

"బావా?" అంది పట్టుదలని దూరం చేసి.

శంకరం తలెత్తి—"నువ్వా రాధా" అన్నాడు

'కనీసం కుర్చీలోంచి లేవనైనా లేదు. ఏం బావ ఏమిటో? ఎప్పుడూ చదువే'—సణుక్కుంది.

"చదువుకోడానికి పుస్తకాలుంటే ఇవ్వు బావా."

"ఇదుగో రాధ. తీసుకో."

రాధ వయ్యారంగా వెళ్ళి పుస్తకం అందుకుంటుంటే అతని వేళ్ళు రాధ వేళ్ళని సున్నితంగా తాకాయి. తనువంతా పులకరించింది. శంకరం కేసి సిగ్గుపడుతూ చూసింది.

గబగబా వెనక్కి తిరిగి పుస్తకం తెరచి చూసింది బావ క్లాసు పుస్తకం. రాధ కోపంతో తల తిప్పి శంకరం కేసి చూసింది. అతను నవ్వుతున్నాడు. అబ్బ! ఎంత అందంగా నవ్వుతాడనీ!

"నేనంటే వేళాకోళంగా వుందా?" అంది చిరుకోపంతో.

"లేకపోతే ఏమిటి రాధా! వొచ్చినదానివి వెంటనే వెళ్ళిపోవడమేనా? కాసేపు కబుర్లు చెప్పాలని తెలీదూ?"

"హాల్లో మామయ్య వున్నాడు."

"అయితే అల్మరాలో నీక్కావల్సిన పుస్తకాలున్నాయ్ తీసుకెళ్ళు."

"చిత్తం." అని రాధ అల్మార దగ్గర కెళ్ళి పుస్తకాలు చూస్తోంది.

శంకరం గబుక్కున లేచి రాధ చెయ్యి పట్టుకున్నాడు. దగ్గరకు తీసుకోబోయాడు.

అప్పుడే హాల్లో నుంచి—

"ఒరేయ్." అన్న మామయ్య కేక విన్పించింది.

రాధ ఖంగారుగా—"మామయ్య." అంది.

శంకరం తొట్రుపాటుపడుతూ చెయ్యి వొదిలేశాడు.

"ఒరేయ్ అప్పన్నా—ఈ వెధ వెక్కడ చచ్చేడో ఏమో! సమయానికి ఒక్కడూ కనిపించడు."

రాధ ఫకాల్న నవ్వేసింది!

శంకరం తలొంచుకున్నాడు.

రాధ పుస్తకం తీసుకొని వెడ్తూ—

"బావా! నువ్వు" గలగలా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

మరో రోజు ఏం చేశాడనీ?

రాధ హాల్లో కూర్చుని మల్లెపూల చెండు కడుతోంది. నెమ్మదిగా, హాయిగా, తియ్యగా పాట పాడుతోంది బయట వర్షం కురుస్తోంది ఈదురు గాలి వీస్తోంది.

రాజేశ్వరమ్మ వంటింట్లో వంట చేస్తోంది. తల్లికి సహాయం చెయ్యాలంటే ఇంతందమైన సాయంత్రాన్ని వంట చెయ్యడం అనే ప్రక్రియంతో వృధా చెయ్యడం ఇష్టంలేదు.

బావ వొడిలో తలవాల్చి, ముఖంలో ముఖం పెట్టి తన్మయత్వంతో ఈ లోకాన్ని మరచిపోవాలి అవును బావా! నువ్వు నాక్కావాలి. నీ నవ్వులూ, నీ మాటలూ నీకష్టాలూ, నీ సుఖాలూ అన్నీ నాక్కావాలి. నిజం బావా ఇది!

కిటికీ దగ్గర అలికిడైతే అటు చూసింది.

ఆమె కేసే శంకరం చూస్తున్నాడు.

"అదేం బావా! లోపలకు రాకుండానే అక్కడే వున్నావ్?"

"చాలా బాగా పాడావ్ రాధా! ఇంకా పాడు. నీ పాటల్లో నేను కరిగిపోయి, ఇద్దరం ఒకటై పోదాం. పాడు రాధా! పాడు"

"కవిత్వం చెబుతున్నావ్" అని రాధ నవ్వుతూనే వుంది.

శంకరం లోపల కొచ్చి రాధ భుజం మీద చెయ్యి వేశాడు.

కిటికీలోంచి రాజేశ్వరమ్మ కనిపిస్తోంది.

శంకరం సాహసం ఆమెకెంతో ఆనందం కలిగించింది!

"మా అమ్మ కనిపిస్తోంది" అంటూ బావను విడిపించుకుని లోపల కెళ్ళబోయింది. ఇంతలో రాజేశ్వరమ్మ— "రాధా" అంటూ పిలిచింది.

శంకరం పరుగెడుతున్న రాధ జడ పట్టుకుని, తనతలకు లాక్కుని ముద్దు పెట్టుకోబోయేడు.

"అమ్మాయ్ రాధా! ఏం చేస్తున్నావే అక్కడ?"

శంకరం నీళ్ళు కారిపోయాడు.

"వుసేవ్ రాధా! పలకవేమే? ఎవరక్కడ?"

అప్పుడు శంకరం రాధను వొదిలేసి—

"దాహంగా వుంది రాధా! మంచి నీళ్ళు." అన్నాడు ఖంగారుగా.

రాధ వెన్నెల కురిసినట్టు—మెత్తగా, మత్తుగా నవ్వి—

"ఇంత పెద్ద వర్షంలో దాహం ఏమిటి బావా?" అంటూ లోపల కెళ్ళింది.

* * *

రాధ దొడ్లో నుంచి లేచి గదిలో కొచ్చింది.

కిటికీ దగ్గరున్న మంచం మీద పడుకుంది. బయటకు చూసింది.

కొబ్బరి చెట్ల పైకి చందమామ ఎగబాకింది వెన్నెల పసిపాపలా నవ్వుతోంది. హాయిగా గాలి వీస్తోంది.

శంకరం గుర్తు కొస్తున్నాడు.

అవును బావా! నువ్వు నాక్కావాలి. నీకంటికి రెప్పనీ; నీ ప్రాణానికి ప్రాణంగా నేను కావాలి. నీ అడుగులో అడుగై దూరంగా, చాలా దూరంగా ఒకరికొకరం తోడుగా సాగిపోవాలి.

బావా! నాకు ఎక్కువ ఆశలు లేవు. నా సర్వస్వం నువ్వు కాగలిగిననాడు నాకింకేం కావాలి? నీతో ఎన్నెన్నో చెప్పాలి. మనిద్దరం ఒకరికొకరం చూసుకుంటూ వెర్రిగా నవ్వుకోవాలి. మన భవిష్యత్తు మన జీవితం, మన కలలూ— వీటి గురించి సంతోషంగా ముచ్చటించుకోవాలి. చాలు బావా! చాలు. నాకింకేం వొద్దు నీనుంచి

బావకేం తక్కువ. అందగాడు. చొరవగా మాట్లాడుతాడు. డాక్టరు చదువుతున్నాడు. వీటన్నిటి కంటే అందమైన మనసుంది

ఒకవేళ బావ.. రాధ ఆందోళనతో గుండె దిటవు చేసుకుంది.

బావ చదువుకునే క్లాసులో చాలా చాలా అందమైన అమ్మాయి లుంటారు. వాళ్ళంతా బాగా చదువుకున్నవారు. ఆ రంగురంగుల వలయంలో, వాస్తవంకాని కలలో బావ చిక్కుకుంటే? బావ అటువంటి వాడుకాడు. నమ్ముకున్న నన్ను అన్యాయం చెయ్యడు. ఏమో? నాకంటే అందమైన ఆడుకూతుర్లు, బావతో పాటు చొరవగా సినిమాలకూ, షికార్లకూనూ తిరగొచ్చు. అప్పుడు బావకి మైకం కలగొచ్చు. ఆ మైకంలో పడి బావ తనని మరిచిపోడం ఎంతసేపు?—రాధ నిలువునా కంపించిపోయింది. వళ్ళంతా చెమటల్లు పోశాయి.

ఆ వెంటనే చిన్ననాటి స్నేహితురాలు జానకీ గుర్తు కొచ్చింది. జానకీ అందమైనది. పైగా కలుపుగోలు మనిషి. ఇద్దరూ కలిసి హైస్కూల్లో చదువుకున్నారు అప్పైన వాళ్ళ నాన్నకు ట్రాన్స్ ఫర్ అవ్వడం, జానకి కాలేజీలో చేరడం ఒకే సారి జరిగింది. ఇప్పుడు జానకీ కూడా విశాఖపట్నం లోనే చదువుతోంది. అది ఉత్తరం రాసి చాలారోజులైంది. బదులు రాయలేదు.

బావ వివరాలూ, తను బావను పెళ్లి చేసుకోవాలనుకోవడం.. ఇవన్నీ జానకికి రాసి... బావెక్కడ ఏం చేస్తూ వున్నాడో ఎలా వుంటున్నాడో — ఎప్పటి కప్పుడు తెల్సుకుంటూ ఉత్తరం రాయమంటే ... జానకి ఆప్తస్నేహితురాలు. కాదనదు.

రాధ మంచం మీద నుంచి లేచింది. లైటు వేసింది. జానకికి ఉత్తరం రాయసాగింది...

* * *

మాధవరావుగారు ఆరోజొచ్చిన పోస్టు చూసుకుంటున్నారు. ఆయన్ని అమితంగా ఆకర్షించింది వో నీలం కవరు! ఆసక్తిగా చించి చదివారు. భార్య శాంతమ్మ గుమ్మాని కానుకుని నుంచుంది. ఆయన మరోసారి ఆ ఉత్తరాన్ని చదివి నిట్టూర్చారు. నుదుటి మీద పట్టిన చెమటను తుడుచుకున్నారు.

ఇంతలో రాధ కూనిరాగాలు తీస్తూ ఆ ఇంట్లో అడుగుపెట్టింది. మామయ్యను చూసి ఆగింది. ఆయన గంభీరంగా వున్నారు. చేతిలో ఉత్తరం రెపరెపలాడుతోంది.

రాధ అత్తయ్య దగ్గర కెళ్ళబోయింది.

"రాధా" అన్నారు మాధవరావుగారు.

"ఏం మామయ్యా?"

"వెళ్ళిం తర్వాత శంకరం నీకు ఉత్తరం రాశాడా?"

"నిన్ననే వొచ్చింది మామయ్యా."

"అవుతే సర్లే"

మాధవరావుగారు ఆ ఉత్తరాన్ని జేబులో పెట్టుకుని నవ్వుకున్నారు. పదహారో రోజున అదే రంగు కవరు మళ్ళీ వొచ్చింది ఈసారి మాధవరావుగారు అంత ఆసక్తిగా ఆ కవర్ని చించ లేకపోయారు. రాత్రి భోజనం చేసి పడుకోబోయే ముందు ఆ కవర్ని చించి చదివారు. కోపంతో చిందులు తొక్కారు. శంకరం మీద ఎన్నడూ రానంత కోపం వొచ్చింది.

రాస్కెల్ని! వెంటనే పిలిపించేసి పెళ్లి చేసేస్తాను. ఈ డాక్టరూ వొద్దు పిండాకూడూ వొద్దు. ఇంటి దగ్గర హాయిగా వుండమని చెప్పేస్తాను. వీడేదో ఉద్ధరిస్తాడనుకుంటే ఇదా ఉద్ధరింపు! ప్రేమట. ప్రేమించాట్ట!— షూట్ చేసి పారేస్తాను వీడి ప్రేమనీ వీడ్నీనూ

మాధవరావుగారు మళ్ళీ ఆ ఉత్తరం చదివారు.

వైజాగ్,

శ్రీ మాధవరావుగార్కి,

క్రితంసారి మీకో ఉత్తరం రాశాం. చదివి మీరు ఉపేక్షించి వూరుకున్నారు. మీ శంకరం ప్రేమనే రంగురంగుల ఊయలలో గిరగిరా తిరుగుతున్నాడు. చదువూ, కాలేజీ లేదు. అంతా ప్రేమ.

మీరిలా వూరుకుంటే అతను మీకు దక్కడు. ప్రేమను తప్పకుండా పెళ్ళి చేసుకుంటాడు.

ఇది చూస్తూ వూరుకోలేం. మా కర్తవ్యాన్ని గుర్తుంచుకుని మీకు రాస్తున్నాం.

ఇప్పటికయినా మీరు మీ అబ్బాయిని అదుపులో పెట్టగలరు.

మీ

శ్రేయోభిలాషులు.

అవును! వాడు చెడిపోయే వుంటాడు. కాకుంటే ఆ మిత్రులు రాయవల్సిన అవసరం వుండదు. వెంటనే టెలిగ్రాం ఇచ్చేస్తాను.

*　　　*　　　*

ఆ ఇల్లు చాలా నిశ్శబ్దంగా వుంది. మాధవరావు గారు గంభీరంగా కుర్చీలో కూర్చున్నారు. ఆయన కెదురుగా శంకరం కూర్చున్నాడు. శాంతమ్మ గుమ్మాని కానుకుని కళ్లప్పగించి చూస్తోంది. రాధ కిటికీలో కూర్చుని హాల్లోకి చూస్తోంది.

"అవున్రా! నువ్వు పెద్దవాడివైపోయావ్. ఎవతో ప్రేమట దాని వలలో పడి ఇష్టం వొచ్చినట్టు తిరుగుతున్నావట. అవునా?"

శంకరం ఈ మాట విని అదిరిపోయాడు.

"ఏమిటి నాన్నా! మీరనేది?" అన్నాడు.

"అవున్రా! తిరిగేటప్పుడివన్నీ తెలీవ్. తీరా వ్యవహారం కాస్తా బయట పడేప్పటికి ఇదీ వరస. ఇదిగో ఈ ఉత్తరం చదువు."

శంకరం అదందుకుని చదివాడు. మ్రాన్పడిపోయాడు. తనకేమీ తెలీదు! అసలీ ప్రేమ ఎవరు? తనకు ఆడవాళ్లతో అసలు పరిచయమే లేదే? మరిదంతా ఏమిటి? ఎవ్రాశారు?

"ఒరేయ్! వళ్ళు దగ్గర పెట్టుకుని మసలుకో. మరోసారి ఇటువంటి కంప్లయింట్ వొచ్చిందా వెంటనే రాధకూ నీకూ ముడి పెట్టేస్తాను. దాని కన్యాయం చేద్దామనుకున్నావురా?"

"ఆస లిదంతా ఏమిటో నాకు తెలీదు నాన్నా."

"తిరిగినా తిరిగినట్టు వొప్పుకుంటార్రా ఎవరైనా. మరింక ఆట్టే వాక్కు. డొక్క చీరేస్తాను. బుద్ధిగా చదువుకో, కబడ్దార్."

తల్లి ఘొల్లున యేడ్చేసింది. మాధవరావు హాల్లో పచార్లు చేస్తూ వుండిపోయారు. అక్కడనుంచి శంకరం విసురుగా గదిలోకి వెళ్ళిపోయాడు.

గుమ్మంలో అతని కెదురుగా రాధ నుంచుంది.

*　　　*　　　*

పదిరోజులు గడిచినా మాధవరావుగారు ప్రశాంతంగా వుండలేకపోయారు. నో రెండు సంఘటనలు ఆయన్లో వున్న సహనాన్నీ, కోపాన్నీ పరీక్షించాయి. శంకరం అన్యాయం చేస్తాడేమోనని కూడా భంగారు పడ్డారు.

కథ కాని కథ

ఆవూరి ప్రెసిడెంట్ మాధవరావుగారి దగ్గర కొచ్చి—

"మాధవరావ్! మీ శంకరం దేన్నో వెంటేసుకుని వైజాగ్‌లో ఇంత పబ్లిగ్గా తిరుగు తాడనుకోలేదోయ్" అన్నాడు.

"నిజమేనా!"

"నా కళ్లతో చూశాను. పైగా, దాన్ని కూడా వెంటేసుకొచ్చి మరీ పలుకరించాడు నన్ను."

మాధవరావుగారు అదోలా ఐపోయారు.

"ఇదంతా ఏమిట్రా శంకరం అంటే?"

నవ్వి వూరుకున్నాడు.

"ఏమో మాధవరావ్! వాడ్ని కాస్త అదుపులో పెట్టు. రాధ ఇది వింటే చచ్చి వూరుకుంటుంది."

ఆ రాత్రికి రాత్రే మాధవరావుగారు విశాఖపట్నం ప్రయాణమయ్యారు.

తండ్రిని చూసి శంకరం తెల్లబోయాడు!

"ఏమిటి నాన్నా...."

"అవున్రా! నువ్వు చేసే పన్లు అలా వున్నాయ్. నలుగుర్లో తలెత్తుకు తిరగాలనేనా నీ వుద్దేశం."

"మీ రనేది?.."

"అవున్రా! అనే దేముంది? లక్షణంగా ఈ చదువు మానేసి ఇంటికి ప్రయాణంకా. అంతా అక్కడ మాట్లాడుకుందాం."

ఆయన దిగిన హోటల్‌కి వెళ్ళిపోయారు.

ఆ సాయంత్రం మాధవరావుగారు బీచ్‌లో తనక్కాస్త దూరంలో కూర్చున్న జంటను చూసి మండిపడ్డారు. వాళ్ళిద్దరూ కులాసాగా, సంతోషంగానూ మాట్లాడుకుంటున్నారు.

శంకరం అటుకి దూరంగా వున్న కొండల్నీ, అక్కడున్న మేఘాల్నీ చూస్తున్నాడు.

*　　　*　　　*

"అవున్రా! నువ్వెదిగిపోయావ్. మంచిచెడ్డలు ఆలోచించే సమయం లేదు నీకు. దాన్నెవతెనో కట్టుకుని ప్రేమంటూ తిరుగుతూ నాశనం అవుదామనుకున్నావ్. అవునా?"

"నేను..."

"రేయ్! నువ్వేం చెప్పక్కర్లా. అసలు నువ్వేది చెప్పినా నమ్మను. నీ వ్యవహారం స్పష్టంగా చూశాను. కాదనగలవా? శంకరం! రంగు రంగుల చీరలు కట్టుకున్న పై పై అందానికి మోసపోకురా. అదంతా వొట్టి కల. ఇంద్రజాలం. అందులో చిక్కుకోకు. జరిగిందేదో జరిగింది. దాన్ని వొదిలి పెట్టేయ్. రాధ ముఖం చూడరా. నిన్ను నమ్ముకున్న దాన్ని అన్యాయం చెయ్యొద్దు. వొద్దు శంకరం. వొద్దు దాన్ని వట్టేటముంచకు."

"........................."

"రాధ కేం తక్కువరా. స్కూల్ ఫైనల్ వరకూ చదువుకుంది. అందమైంది. గుణం వుంది. నిన్ను సుఖపెట్టగలది నిన్నే చేసుకోవాలనుకుంది."

నో మూల రాధ గోడకు ఆనుకుని ఇదంతా వింటోంది. ముఖమంతా దీనంగా మారిపోయింది. కళ్ళు చెమర్చాయి. శాంతమ్మ వచ్చి రాధ భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వేసింది.

"అత్తయ్యా" అంటూ రాధ ఒక్కసారిగా యేడ్చేసింది.

"అలా పైలురాయిలా వున్నావేరా?"

"నేనింకేమీ చెప్పవల్సింది లేదు."

"నువ్వు రాధను కాదన్నావా? ఈ ఆస్తంతా దాని పేర్న రాసేస్తాను. జాగ్రత్తగా ఆలోచించు. నాలుగురోజులు టైమిస్తున్నాను. ఈ వారంలో పెళ్లి జరిపించేస్తాను. కాదూ కూడదన్నావా! కాళ్ళూచేతులూ కట్టేసి పీటల మీద కూర్చోబెడతాను." మాధవరావుగారు అక్కడనుంచి వెళ్ళిపోయారు.

రాధ కళ్లు తెరచి చూసింది. గదిలో జీరోల్ట్ బల్బు వెలుగుతోంది.

తలంతా బరువుగా వుంది. చలిజ్వరం వొచ్చినట్లుగా వణకసాగింది. పిచ్చిగీతల్లా ఆలోచనలన్నీ గజిబిజిగా, గంద్రగోళంగా వున్నాయి. ఒక్కటీ సరైన రూపం కన్పించడం లేదు.

'బావ తన కన్యాయం చేస్తాడని కలలో కూడా అనుకోలేదు. ఇదెలా జరిగింది? అవును తనకంటే బాగా చదువుకున్నదీ, అందమైన దానిసీమా బావ ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నాడు. తను బావకు పనికిరాదు. బావ తనతో ఇదివరకు ప్రవర్తించిన తీరూ, ఆడిన హాస్యం అన్నీ నటనేనా? బావనే ఈ విషయం అడిగితే...'

రాధ మంచం మీద నుంచి లేచింది. తలుపులు తీసింది. బయటంతా చీకటిగా వుంది. నెమ్మదిగా ముందుకు అడుగులు వేసింది.

శంకరం ఉలిక్కిపడ్డాడు.

కాళ్ళ దగ్గర రాధ యేడుస్తోంది.



శంకరం తిన్నగ లేచి—

“ఇంతర్ధరాత్రిలోనా రాధా.” అన్నాడు.

“బావా! మామయ్య మాట్లాడిన దంతా నిజమేనా? చెప్పు బావా! చెప్పు. ఇదంతా వొట్టి దని.’

శంకరం మౌనంగా వూరుకున్నాడు.

చాలాసేపు నిశ్శబ్దంగా గడచింది.

రాధ శంకరం కాళ్ళ దగ్గర అలాగే కూర్చుంది.

చివరకు రాధ అంది—

“బావా! ఒకటడగాలనుంది. అడగనా?”

“అడుగు.”

“ఆ అమ్మాయి నా కంటే అందంగా వుంటుందా?”

శంకరం మాట్లాడలేకపోయాడు.

రాధ, అతని సమాధానం కోసం కొన్ని నిముషాలు చూసి గుండెలు పగిలేలా యేడుస్తూ అక్కడ నుంచి గబగబా వెళ్ళిపోయింది!

* * *

ఆరాత్రి—

“నన్ను క్షమించు బావా! నీకు తెలియకుండానే నాటకం ఆడాను.” అంటూ రాధ శంకరం వొడిలో వాలిపోయింది.

ఆమె అందంగా వుంది. ఖరీదైన చీరలో మెరిసిపోతోంది.

“నాకు అంతా తెల్సు రాధా!”

“నీకు తెలీదు బావా! అందర్నీ కష్టపెట్టాను.”

శంకరం నవ్వి రాధను దగ్గరకు తీసుకుని గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆ తర్వాత తను జేబులోంచి ఉత్తరం తీసి చదవసాగాడు—

ప్రియమైన జానకీ

....నా బావనే పెళ్లి చేసుకోవాలి చాలా తొందర్లో. నా బావతో ఆనందంగా గడపాలి. మనసులు విప్పి మధురంగా మైమరచిపోవాలి. సెలవుల్లో బావ ఇంటి కొచ్చినా కులాసాగా మాట్లాడుకో నివ్వడు మామయ్య.

అంచేత మామయ్యకు నేనే స్వయంగా రాసిన ఉత్తరం ప్రతి పదిహేను రోజులకూ పంపుతాను

ఇక్కడ మీ శంకరం ఎవతో అమ్మాయిని వెంటేసుకుని తిరుగుతూ పెళ్లి చేసుకుంటానంటు న్నాడు...”

ఇలా రాసే ప్రతి ఉత్తరాన్ని మామయ్య పేర ‘పోస్ట్ చెయ్. చదివి, ఇదంతా నిజం అనుకుని నాకూ శంకరం బావకూ తొందర్లో వివాహం చేస్తాడు....

రాధ గబాల్న ఆ ఉత్తరాన్ని శంకరం చేతుల్లోంచి లాక్కుని—

“ఇది నేనే రాశాను బావా. ఇది నా స్వార్థం కోసం చేశాను.

అవునూ! ఈ ఉత్తరం నీకెలా వొచ్చింది?” అంది.

“వో రోజు నన్ను వెదుక్కుంటూ జానకి వచ్చి పరిచయం చేసుకుని అంతా చెప్పి, నువ్వు రాసిన ఉత్తరాల్నిచ్చింది.”

“మరీ సంగతి నాకు చెప్పలేదే.”

“నువ్వు నాకు చెప్పావు గనుకనా?!”

“బావా! నువ్వు నన్ను పెళ్లి చేసుకోవటానికే వచ్చిపోయేదాన్ని”

“పిచ్చిరాధా! నా మీద నీకు నమ్మకం కలగ లేదా?”

“అవుతే ఇదంతా ఏమిటి?”

“నేనూ వో చిన్న నాటకం ఆడాను మన పెళ్లి త్వరగా జరగడానికి. నే నెవర్నీ ప్రేమించలేదు. పెళ్లి చేసుకుంటానన్నానా లేదు. ప్రేమ ఎవరో కాదు జానకి. జానకితోనే నేను తిరిగింది. మన పెళ్లి వెంటనే జరగాలనే. జానకి నేను ఆలోచించి ఇలా చేశాం.”

“నేను అదృష్టవంతురాల్ని బావా” అంటూ రాధ శంకరం వొడిలో పరవశంతో ఇమిడి పోయింది.

మీ పళ్లు నాశనముకాకుండా బలపరచు గొప్ప సాధనము బినాకా ఫ్లోరైడ్

పళ్లు ఎందుకు చెడిపోతాయి ?

ముందు, పళ్ళలో ఇరుక్కొన్న ఆహారపుటణువులు ఆమ్లములుగా (యాసిడిగా) విడిపోతాయి.

తరువాత, ఆమ్లములు పళ్ళకు రక్షణ ఇచ్చే దంతికను (ఎనామిలును) బలహీనం చేస్తాయి. ఫలితం-పళ్ళయొక్క ధాతువులు నాశకారక క్రిముల చర్యకులోనై, చెడిపోతాయి. దీనివలన నొప్పి పుట్టే పంటిపుప్పి తయారై, బహుశా పళ్లుకూడా ఊడిపోవచ్చు.

ఏం చేయాలి

పంటి దంతికను ఫ్లోరైడుతో బలపర్చండి. ఫ్లోరైడ్ దంతికతో చేరి, నాశమును ఎదుర్చుటకు పళ్ళకు అదనపు దృఢత్వమును ఇస్తుంది.

ఎలా చేయాలి

బినాకా ఫ్లోరైడుతో క్రమంగా పళ్లుతోమండి. ఈ ఒక్క టూత్ పేస్టులో మాత్రమే చురుకైన ఫ్లోరైడ్ మిశ్రణము-సోడియమ్ మోనోఫ్లోరో ఫాస్ఫేటు-కలిసి ఉంది. ఇంకా, అప్పుడప్పుడు పళ్ళను మీ దంతవైద్యునికి చూపించుకోండి.

బినాకా ఫ్లోరైడుతో మీ పళ్ళలోనికి అదనపు దృఢత్వాన్ని ప్రవేశ పెట్టండి. *ఈ టూత్ పేస్టు ముఖ్యంగా పిల్లలకు ఎంతో శ్రేష్ఠం!*

CIBA Cosmetics

ప్రతి ట్యూబ్‌తోను ఒక బహుమానము కలదు